శుక్రవారం
17 జూలై 2020

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 03
సంచిక : 137
పేజీలు: 4
వెల: రూ.3/-

Website: www.subhatelangana.in

RNI No: TELTEL/2017/72695

శుభ తెలంగాణ

మేడ్చల్ - హైదరాబాద్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar.

కరోనా వ్యాక్సిన్‌పై ఆక్స్‌ఫర్డ్ గుడ్ న్యూస్



ట్రయల్‌రన్స్ సక్సెస్ అవుతున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ, జూలై16 : కరోనా వైరస్ ప్రపంచాన్నే వణికిస్తుంది. ఈ వైరస్‌ను వివారించేందుకు ప్రపంచ దేశాల్లోని ఎంతో మంది శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఇటీవల కరోనా వైరస్ కట్టడికి వ్యాక్సిన్‌ను కనిపెట్టిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వాక్సిన్ ట్రైల్స్‌కు సంబంధించి శుభవార్త చెప్పనుంది. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించి ఫేస్-3 హ్యూమన్ ట్రైల్స్ పూర్తి చేశామని యూనివర్సిటీ స్పష్టం

- కొనసాగింపు 2లో..

ఉస్మానియాను కూలగొట్టి కడతామన్న..

హామీ ఏమైంది?



-ఉస్మానియా చెరువైనా స్పందన ఏది!
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా పట్టించుకోరేం
- ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించిన బిజెపి బృందం
- కరోనాపై సర్కార్ చేతులెత్తేసింది
- బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్

హైదరాబాద్, జూలై 16(శుభ తెలంగాణ):

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఓవైపు కరోనా బాధితుల తాకిడి.. మరో వైపు మురుగు నీటితో ఉస్మానియా ఆసుపత్రిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈనేపథ్యంలో భాజపా నేత రామచంద్ర రావు తదితరులతో కలిసి బండి సంజయ్ గురువారం ఉస్మానియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...

- కొనసాగింపు 2లో..

విరసం నేత వరవరరావుకు కరోనా



ముంబై, జూలై16 :

విరసంనేత వరవరరావు ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటి నుంచో కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంబై జైలులో 81ఏళ్ల వరవరరావు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండడంతో.. ఆయనను విడుదల చేయాలనే డిమాండ్ ఉంది. ఇక, జులై 11వ తేదీన ఆయన నుంచి కుటుంబ

- కొనసాగింపు 2లో..

ఉస్మానియా, గాంధీలను తక్షణమే..

సీఎం సందర్శించాలి

- బిజెపి నేత పొంగులేటి డిమాండ్
- కరోనా కట్టడికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయాలి - తనుగుల జితేందర్ రావు

హైదరాబాద్ (శుభ తెలంగాణ) :



కరోనా ఉధృతి నేపథ్యంలో ఉస్మానియా, గాంధీ ఆసుపత్రిలను ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే సందర్శించి పరిస్థితులను చక్కదిద్దాలని బిజెపి కోర్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనిటి ఆఫ్ ప్రెస్ అండ్ మీడియా ప్రధాన కార్యదర్శి తనుగుల జితేందర్ రావు తో కలిసి

- కొనసాగింపు 2లో..

పరిషత్‌లకు 15వ ఆర్థికసంఘం..

నిధులు మంజూరు

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నిధుల రాక
- అభివృద్ధి పనులకు తొలగనున్న అడ్డంకులు

హైదరాబాద్, జూలై 16(శుభ తెలంగాణ):

కొన్నేళ్లుగా నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న స్థానిక సంస్థలకు మళ్లీ నిధులు వచ్చి పడుతున్నాయి. జిల్లా, మండల పరిషత్‌లకు నిధులు బదిలీ అవుతున్నాయి. మండల పరిషత్‌లకు 10శాతం, జిల్లా పరిషత్‌లకు 5 శాతం నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. దీనికి సంబంధించిన విధివిధానాలు జిల్లా అధికారులకు అందాయి. ఇప్పటికే గత పాలక వర్గానికి 14వ ఆర్థిక సంఘం నిధులు అందకుండానే పదవీ కాలం ముగిసిపోయింది. మళ్లీ గతేడాది క్రితం కొత్త పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టింది. అయితే ఏడాది అనంతరం 15వ ఆర్థిక

- కొనసాగింపు 3లో..

ఉస్మానియా హాస్పిటల్‌లోకి నీళ్ళు రావటం అంటే..

కెసిఆర్ తలదించుకోవాలి



- ఉస్మానియాలోకి వరదనీరు రావడం సిగ్గుచేటు
- ఆస్పత్రిని సందర్శించిన కాంగ్రెస్ బృందం
- తక్షణం ఉస్మానియాను అభివృద్ధి చేయాలన్న ఉత్తమ్

హైదరాబాద్, జూలై 16(శుభ తెలంగాణ):

ఉస్మానియా హాస్పిటల్‌లోకి నీళ్ళు రావటం అంటే సీఎం కేసీఆర్ సిగ్గుతో తల దించుకోవాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. వార్డులన్నీ నీళ్లలో తేలుతుంటే... రోగులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోక పోవడం సిగ్గుచేటు కాక మరోటి కాదన్నారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిటీ అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, ఫిరోజ్ ఖాన్ తదితరులు గురువారం ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించి పరిస్థితులు పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులు, వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతర్ ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పనితీరుకు ఉస్మానియా సంఘటనే నిదర్శనం అన్నారు.

- కొనసాగింపు 2లో..

నేటినుంచి అంతర్జాతీయ..

విమాన రాకపోకలు

- తొలుత అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ దేశాలకు సర్వీసులు
- విమానయాన శాఖ మంత్రి హర్దిప్ సింగ్ పూరి వెల్లడి

న్యూఢిల్లీ,జూలై16 : విదేశీ విమానాల రాకపోకలకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.నేటి నుంచి అంటే శుక్రవారం నుంచివిదేశీ విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయని కేంద్ర

- కొనసాగింపు 2లో..

మరో టిఆర్ఎస్ ఎమ్మెల్యేకు కరోనా

- ఇంట్లోనే ఐసోలేషన్‌కు వెళ్లిన భాస్కర్ రావు

హైదరాబాద్, జూలై 16(శుభ తెలంగాణ): తెలంగాణలో ప్రజా ప్రతినిధులను కరోనా భయం వెంటాడుతోంది. ముఖ్యంగా అధికార టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కోవిడ్ కంగారు పెడుతోంది.వరుసగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కరోనా వైరస్ సోకుతుంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలకు కరోనా సోకగా తాజాగా మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర రావు సైతం కరోనా బారినపడ్డారు. జలుబు, దగ్గు లక్షణాలు కనిపించడంతో రెండు రోజుల కింద ఆయన పరీక్షలు

- కొనసాగింపు 2లో..

తిరుమలలో 140మందికి కరోనా

- కరోనా సోకిన అర్చకులకు క్వారంటైన్
- ప్రస్తుతానికి యధావిధిగా శ్రీవారి దర్శనాలు
- అవసరమైతే దర్శనాలు ఆపేస్తామన్న చైర్మన్



తిరుమల, జూలై16(శుభ తెలంగాణ):

తిరుమలలో పూజారులు సహా 140మందికి కరోనా పాజిటివ్ ఉందని తేలిందని టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అంగీకరించారు. రమణ దీక్షితులు చేసిన ట్వీట్‌కు రాజకీయ రంగు పులమకండని, గౌరవ ప్రధాన అర్చకులుగా ఉండి ఇలా ట్వీట్ చేయటం మంచి పద్ధతి కాదని సూచించారు. ఏమైనా సమస్య ఉంటే రమణ దీక్షితులుతో కూడా చర్చిస్తామని అన్నారు. అర్చకులకి ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంటే దర్శనాలు కూడా ఆపివేస్తామని అన్నారు. తాజాగా టీటీడీలో 140 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆందోళన నెలకొంది. ఇదే విషయంపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. కరోనా వైరస్ వల్ల భక్తులకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. దర్శనాలు ప్రారంభించాక టీటీడీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కరోనా పరీక్షలు నిర్వహిస్తే 140 మందికి పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. పాజిటివ్ వచ్చిన వారిలో అర్చకులు, టీటీడీ ఉద్యోగులు, ఎస్టీఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది, లడ్డు తయారు చేసే సిబ్బంది ఉన్నారని వెల్లడించారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారిలో 70 మంది కోలుకుని హోం క్వారంటైన్‌లో ఉండగా, క్వారంటైన్‌లో ఉన్నవారిలో ఒక్కరు మినహా అందరు ఆరోగ్యంగా ఉన్నారని ఆయన

- కొనసాగింపు 2లో..

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న శుభ తెలంగాణ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడిషన్ ఇన్‌చార్జ్‌లు, జిల్లాల వారీగా బ్యూరో ఇన్‌చార్జులు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జులు. మండలాలకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ :
7799911110

www.subhatelangana.in
subhatelangana.app

శుభ తెలంగాణ
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

హామీ ఏమైంది?

– మొదటిపేజీ కొనసాగింపు..

రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులపై నోరు విప్పడం లేదన్నారు. ముఖ్య మంత్రికి ప్రాజెక్టులపై ఉన్న శ్రద్ధ శిథిలావస్థకు చేరిన ఆసుపత్రులపై లేదని విమర్శించారు. ఆసుపత్రుల్లో డీపీఆర్‌లు ఉండవు కాబట్టి ముఖ్యమంత్రి ఇటువైపు దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో దోపిడీని అరికట్టడంలో సీఎం విఫల మయ్యారన్నారు. కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని అడిగితే కనీసం స్పందించలేద న్నారు. ఉస్మానియా ఆసుపత్రి కూలే స్థితిలో ఉందని ...వెంటనే సీఎం ఆసుపత్రిని సందర్శించాల ని డిమాండ్ చేశారు. ఉస్మానియా ఆసుపత్రి అభివృద్ధిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని బండి సంజయ్ అన్నారు. వానపడితే ఉస్మానియా ఆస్పత్రి చెరువుగా మారిందన్నా రు. ప్రభుత్వం ఎన్ని చెబుతున్నా తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలగడంలేదు. కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ కొరత ఉందంటూ పదేపదే ఆరోపణలు వస్తున్న తరుణంలో నిన్న గాంధీ ఆస్పత్రిలో ఒకరు మృతి చెందారు. ఆక్సిజన్ పెట్టనందునే అతను చనిపోయిన ట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణలో కోవిడ్ పేషెంట్లకు గాంధీలో చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయ ని ప్రభుత్వం పదేపదే చెబుతోం ది. కానీ పరిస్థితి మాత్రం అందు కు విరుద్ధంగా ఉంది.నిన్న గాంధీ లో ఆక్సిజన్ అందక ఒకరు మృతి చెందడమే ఇందుకు నిదర్శనం. ఉ స్మానియాను పునర్నిర్మిస్తానని చెప్పి కెసిఆర్ మాటతప్పారని బండి సంజయ్ అన్నారు. సోషల్ మీడియాలో హాట్ టాపిక్ ఉస్మానియ ఆస్పత్రి చక్కర్లు కొట్టినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని బండి సంజయ్ కుమార్ అన్నారు.ఇంత జరుగుతు న్న ఎవరు పటించు కోవడం లేదు. ఈ కేసీఆర్ ప్రభుత్వానికి సోయి లేదు. ఇక్కడ ప్రజల ప్రాణాలు పోతుంటే.. సీఎం ఫామ్ హౌజ్‌కి పరిమితం అయ్యాడు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో కరోనా వైద్యానికి లక్షలు దండుకుంటున్నారు.. శవాల మీద పైసలు ఏరుకుంటున్నారు. ఆ ఖర్చు తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులకు ఒక రోగంతో వెళ్తే... అక్కడి నుండి మరో పది రోగాలు వెంటబెట్టుకొని రావాల్సి వస్తోంది. ఇంతక ముందు ఉస్మానియాని కూలగొట్టి కొత్తగా కడతాను అని సీఎం కేసీఆర్ మాట ఇచ్చాడు. ఇప్పుడు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. పైగా బీజేపీ కేసులు వేసి అడ్డుకుంది అంటున్నారు. మరి కాళేశ్వరం, సెక్రటేరియట్ విషయాల్లో కూడా కేసులు వేశాం. మరి వాటిని ఎలా కట్టారు అని సంజయ్ ప్రశ్నించారు.

ఉస్మానియా, గాంధీలను తక్షణమే..
సీఎం సందర్శించాలి

– మొదటిపేజీ కొనసాగింపు..

మాట్లాడుతూ..ఒకవైపు కరోనా.. మరోవైపు వర్షాలతో ఉస్మానియా ఆసుపత్రిలో రోగులు ,డాక్టర్లు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు... కరోనా కష్టకాలంలో తెలంగాణ ప్రజలకు భరోసా ఇవ్వవలసిన భాద్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. కరోనా కట్టడికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ సమీక్ష చేస్తున్నారని కేసీఆర్ కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.. ప్రైవేటు ఆసుపత్రులు కరోనా రోగులను దోచుకుంటున్నాని ఆరోపించారు.. ప్రైవేటు ఆసుపత్రిలలో ఫీజులను నియంత్రించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందన్నారు.. హైకోర్టు మొట్టికాయలు వేసిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని ధ్వజమెత్తారు... కరోనా కట్టడికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ లను ఏర్పాటు చేయాలని కోరారు. ..వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.. జిల్లాలలో ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మందులు ,పరికరాలు అందుబాటులో ఉంచడం తోపాటు భద్రాచలం ఏజెన్సీ లో ర్యాపోడ్ టెస్టు లకు వైద్యుల ను సిద్ధం చేయాలని సూచించారు.

నేటినుంచి అంతర్జాతీయ..

– మొదటిపేజీ కొనసాగింపు..

పౌర విమానయాన శాఖ మంత్రి హర్దిప్ సింగ్ పూరి వెల్లడించారు. విమాన సర్వీసులు నడిపేందుకు మూడు దేశాలతో జరిపిన చర్చలు కొలిక్కి వచ్చాయన్న ఆయన.. మొదటగా అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ దేశాలకు సర్వీసులు ప్రారంభిస్తామని వెల్లడించారు. కరోనావైరస్ కట్టడిలో భాగంగా లాక్‌డౌన్ విధించడంతో దేశీయ, విదేశీ విమాన సర్వీలు నిలిపివేశారు.. అత్యవసర సేవలకు కొన్ని విమానాలు ప్రభుత్వం వాడుకొంది.. ఇక, లాక్‌డౌన్ సడలింపులు వచ్చిన తర్వాత.. వందేభారత్ మిషన్‌లో భాగంగా విదేశాల్లో చిక్కుకున్నవారి కోసం ప్రత్యేకంగా విమానాలు నడిపారు.. దేశీయంగా విమానాలు తిరుగుతున్నాయి.. కానీ, అన్‌లాక్‌లోకి అడుగుపెట్టినా.. విదేశీ విమానా సర్వీసులకు మాత్రం గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. మొత్తానికి నేటి నుంచి అమెరికా, శనివారం నుంచి ఫ్రాన్స్.... భారత్‌కు విమాన సర్వీసులు నడిపేందుకు అంగీకరించాయన్న కేంద్రమంత్రి... జులై 18 నుంచి ఆగస్టు 1 వరకు పారిస్ నుంచి ఢిల్లీ, ముంబై, బెంగళూరు మధ్య 28 విమానాలను ఎయిర్ ఫ్రాన్స్ నడుపుతుందని..జులై 31 వరకు భారత్ అమెరికా మధ్య 18 యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానాలను నడిపేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఇక, యూకే, జర్మనీతో కూడా విమాన సర్వీసులపై సంప్రదింపులు జరిపామని, లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌తో కూడా ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందని అన్నారు.విదేశీ విమాన సర్వీసులపై ఈ నిర్ణయాన్ని పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హర్దిప్ సింగ్ పూరి వెల్లడించారు.

వానలో తడుస్తున్న వృద్ధుడికి ఆశ్రయం

– పోలీస్ సిబ్బందిని ప్రశంసించిన హోంమంత్రి

హైదరాబాద్,జూలై16(శుభ తెలంగాణ): నగరంలో మూడు రోజులుగా వర్షంలో తడుస్తున్న ఒక వ్యక్తిని కాపాడిన పోలీసు సిబ్బందిని రాష్ట్ర హోం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ ప్రశంసించారు. చాంద్రా యణ గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడు రోజులుగా వర్షంలో తడుస్తూ ఒక దుకాణం వద్ద పడిపోయిన వ్యక్తి గురించి సమాచారం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆయన్ను రక్షించారు. ఆ వ్యక్తి తన వివరాలను ఏమీ చెప్పలేని పరిస్థితులు ఉన్నప్పటికీ చాంద్రా యణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహేష్, హోంగార్డ్ సయీద్‌లు ఇద్దరు ఆ వ్యక్తిని రక్షించేందుకు108 వాహనానికి సమా చారం ఇచ్చారు. లేవలేని స్థితిలో ఉన్న అతన్ని 108 వాహనం ద్వారా ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భారీగా వర్షం పడుతున్నప్పటికీ పోలీస్ సిబ్బంది వెళ్లి ఆ వ్యక్తిని కాపాడినందుకు హోం మంత్రి వారికి అభినందనలు తెలియజేశారు. పోలీసు సిబ్బంది శాంతిభద్రతలను కాపాడడంతో పాటు ఈ రకమైన సేవ చేయడం ద్వారా మంచి పేరు తెచ్చుకుంటున్నారని అలీ ప్రశంసించారు.

ఓక్లహోమా గవర్నర్ కెవిన్‌కు కరోనా

వాషింగ్టన్,జూలై16 : అమెరికాలో కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేస్తున్నది. ఇప్పటికే ఆ దేశంలో 36 లక్షల మందికి పైగా కరోనా మహమ్మారి బారినపడ్డారు. లక్ష మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఓక్లహోమా రాష్ట్ర గవర్నర్ కెవిన్ స్టిట్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచార ర్యాలీకి హాజరైన రెండువారాల తర్వాత పరీక్ష చేయిస్తే పాజిటివ్ వచ్చిందని కెవిన్ బుధ వారం ప్రకటించారు. కాగా,అమెరికాలో కరోనాపాజిటివ్ వచ్చిన తొలి గవర్నర్ తానేనని కెవిన్ స్టిట్ తెలిపారు. వైరస్ నిర్ధారణ కావడంతో 47 ఏండ్ల కెవిన్ కుటుంబానికి దూరంగా క్వారెంటైన్‌లో ఉన్నారు. వైరస్ నుంచి విముక్తి పొందే వరకు ఇంటి నుంచే పనిచేస్తానని చెప్పారు. కరోనా వైరస్‌ను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

యాదాద్రి భువనగిరి,జూలై 16(శుభ తెలంగాణ):

కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోబోగాపోలీసులు కాపాడారు.ఈ ఘటన బీబీనగర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోచంపల్లి మండలానికి చెందిన కే రమేశ్(50) ఓప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే రమేశ్ కూతురు ఇటీవలే ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపైకి ఉదయం చేరుకున్నాడు. ఆ వ్యక్తిని గుర్తించిన మరొకరు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన కానిస్టేబుల్స్ డీ.మురళి, మల్లేష్ అక్కడికి చేరుకుని రమేశ్‌ను ప్రాణాలతో కాపాడారు.రమేశ్‌ను బీబీనగర్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్ప జెప్పారు.

కరోనా వ్యాక్సిన్‌పై ఆక్స్‌ఫర్డ్ గుడ్ న్యూస్

– మొదటిపేజీ కొనసాగింపు..

చేసింది. కరోనా వ్యాక్సిన్ ట్రైల్స్‌లో మంచి ఫలితాలు వచ్చయని యూనివర్సిటీ తెలిపింది. వివిధ దేశాలలో వందల మంది కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నా.. వాటిలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శటీ లైసెన్స్ పొందించిన ప్రముఖ ఇండియన్ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా వాక్సిన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. దీంతో తర్వలోనే కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించి శుభవార్త వినే అవకాశం ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. అయితే కరోనా వ్యాక్సిన్ ట్రైల్స్‌లో మంచి ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇది వాడటం వల్ల ఇతర సమస్యలు వచ్చే అవకాశాలు లేవని, ఇది సురక్షితమైన వ్యాక్సిన్‌గా పరీక్షల్లో తేలింది. దీనిని వాలెంటర్ల మీద ప్రయోగించినప్పుడు చక్కని ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు వివిధ దేశాలలో వందల మంది కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నారు. అయితే వాటిలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శటీ లైసెన్స్ పొందించిన ప్రముఖ ఇండియన్ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా వాక్సిన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. ఈ ట్రైల్స్‌కు సంబంధించిన సమాచారం ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెంట్‌లో రానుంది. దీనికి సంబంధించి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటి శాస్త్రవేత్త మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించిన విషయాన్ని ఎప్పుడూ పబ్లిష్ చేస్తారు అన్న విషయాన్ని ఇంకా లాన్సెంట్ సంస్థ కచ్చితంగా చెప్పలేదని తెలిపారు. అయితే ఈ వ్యాక్సిన్ మంచి ఫలితాలను ఇచ్చిందని, ఇది మనుషుల మీద ప్రయోగించినప్పుడు చక్కగా పనిచేసినట్లు తెలుస్తోంది.

మరో టిఆర్ఎస్ ఎమ్మెల్యేకు కరోనా

– మొదటిపేజీ కొనసాగింపు..

చేయించుకున్నారు. బుధవారం రిపోర్టులు వచ్చా యి. అందులో కరోనా పాజిటివ్ రావడంతో మిర్యాలగూడలోని తమ ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నారు. దీంతో కరోనా బారిన పడుతున్న రాజకీయ నేతల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే టీఆర్ఎస్ పార్టీకి చెందిన హోంమంత్రి మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే లు ముత్తిరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, గణేష్ గుప్తాకరోనా బారిన పడ్డారు. ఇక కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, గూడూరు నారా యణరెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కరోనా సోకిన విషయం తెలిసిందే. ఐతే వీరిలో చాలా మంది ఇప్పటికే కోలుకొని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు.ఇక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉ ంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 39,342కి చేరింది. ఇందులో 12,958 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటివరకు వైరస్ నుంచి 25,999 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. రాష్ట్రంలో మొత్తం మృతుల సంఖ్య 386కి చేరింది.

కేరళలో కొత్తగా 722 కేసులు నమోదు

తిరువనంతపురం,జూలై16 : కరోనా పాజిటివ్ కేసుల్లో కేరళ కొత్త రికార్డు సృష్టించింది.. కేరళ సీఎంవో తాజాగా ప్రకటించిన ప్రకారం.. గత 24 గంటల్లో అత్యధికంగా 722 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో.. కేరళలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 10,275కు చేరింది.. ఇక, ఇవాళ మరో ఇద్దరు కరోనా రోగులు మృతిచెందారు.. ఇవాళ నమోదైన కేసుల్లో తిరువనంతపురంలో అత్యధికంగా 339 కేసులు బయటపడగా..,ఎర్నాకుళంలో 57, కొల్లంలో 42, మలప్పురంలో 42, పతనమిట్టలో 39, కోజికోడ్‌లో 33, త్రిస్సూర్‌లో 32, ఇడుక్కిలో 26, అలప్పుజలో 20, పాలక్కాడ్‌లో 25, కన్నూర్‌లో 23, కాసరాగోడ్‌లో 13, వయనామడ్‌లో 13 కేసులు నమోదు అయినట్టు ప్రకటించారు. ధృవీకరించబడిన కేసుల్లో 157 విదేశాల నుండి వచ్చినవారు కాగా.. 67మంది ఇతర రాష్ట్రాల నుండి వచ్చినవారు ఉన్నారు. కరోనా కట్టడి చర్యలతో మొత్తం దేశానికే ఆదర్శం గా నిలిచిన కేరళలో ఇంత పెద్దల సంఖ్యలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి.

టీవీ రావు హఠాన్మరణం బాధాకరం

– సంతాపసభలో మంత్రి పువ్వాడ నివాళి

హైదరాబాద్,జూలై16(శుభ తెలంగాణ):టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) టీవీరావు హఠాన్మరణం బాధాకరమని రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఆయన సేవలు మరువలే మన్నారు. గురువారం నిర్వహించిన సంతాప సభలో మంత్రి మాట్లాడు తూ.. రావు హఠాన్మరణం జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. ఈ సందర్భంగా సభలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సంస్థలో చేపట్టిన అధికార బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఆయన ఏర్పరుచుకున్నారని మంత్రి తెలిపారు. డిపో మేనేజర్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఉ న్నత బాధ్యతలు చేపట్టి వాటికి వన్నె తీసుకొచ్చిన రావుగారు అసువులు బాయటం అందరిని కలచి వేసిందని పువ్వాడ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ బాగుకోసం విధి విధానాల విషయంలో తన అధికార పరిధిలో నిర్మాణాత్మక చర్యలు తీసుకునే వారని, ఆయన సంస్థకు అందించిన సేవలు మరవలేనివన్నారు. సంస్థ పురోభివృద్ధి కోసం పరితపించిన వ్యక్తి మన మధ్యలో లేకపోవటం బాధాకరం అని మంత్రి అన్నారు.

జూరాలకు పెరుగుతున్న వరద

గద్వాల,జూలై16(శుభ తెలంగాణ) : ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద భారీగా వస్తుండడంతో జూరాల జలాశయం జలకళను సంతరించు కుంది. జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పెరుగుతోంది. దీంతో మొత్తం 10 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. ఇన్ ఫ్లోలో 72,000 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లోలో 86,183 క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. యువతీ యువకులు సెల్ఫీలు దిగుతూ సంబరంగా గడిపారు. ప్రాజెక్టు సమీపంలో చేపల విక్రయాలు కూడా జోరుగా సాగాయి. వాటిని అక్కడే వండి ఇస్తుండడంతో జనం ఎగబడి కొనుగోలు చేసి రుచులను ఆస్వాదించారు.

తిరుమలలో 140మందికి కరోనా

– మొదటిపేజీ కొనసాగింపు..

తెలిపారు. కాగా, 40 మంది అర్చకుల్లో 14 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందన్నారు. అలాగే 60 సంవత్సరాలు నిండిన అర్చకులకి విధుల నుండి సడలింపు ఇచ్చామని తెలిపారు. అయితే శ్రీవారి ఆలయంలో భక్తుల దర్శనాలు కొనసాగుతాయని చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలో ఎలాంటి మార్పులు లేవని చెప్పారు. ఆలయంలో నిత్య కైంకర్యాలను, ఇతర కార్యక్రమాలు ఆగమశాస్త్రబద్ధంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ తెలిపారు. దేశ, రాష్ట్రవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండడంతో భక్తుల భద్రత కోసం మెరుగైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. శ్రీవారి ఆలయంలో విధుల్లో మొత్తం 40 మంది అర్చకులు ఉండగా, 14 మందికి పాజిటివ్ రావడంతో స్వామి వారికి కైంకర్యాలు నిర్వహించేందుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూసేందుకు అర్చకుల ఆరోగ్యంపై సమీక్షించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. వేర్వేరు గదులు కేటాయించి భోజన వసతి కల్పించాలని, వయసు పైబడిన అర్చకులను ఇళ్లలోనే ఉండేందుకు, తిరుపతిలో విధులు కేటాయించాలని అర్చకులు కోరారని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చైర్మన్ చెప్పారు. తిరుమలలో భక్తులెవరికీ కరోనా పాజిటివ్ రాలేదని, వారి నుంచి ఉ ద్యోగులకు వైరస్ సోకలేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ద్వారా మాత్రమే కేసులు నమోదయ్యాయని చెప్పారు.

విరసం నేత వరవరరావుకు కరోనా

– మొదటిపేజీ కొనసాగింపు..

సభ్యులకు ఫోన్ రావడం.. ఆయన సరిగా మాట్లాడలేని పరిస్థితుల్లో ఉన్నారని.. వారు ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత.. చివరకు వరవరరావును ముంబై జైలు నుంచి నవీ ముంబైలోని జేజే ఆస్పత్రికి తరలించారు. అసలే వృద్ధాప్యంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనకు తాజాగా కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.. దీంతో.. కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది.. ఆయన కరోనా బారినపడడంతో.. జేజే ఆస్పత్రి నుంచి సెయింట్ జార్జ్ ఆసుపత్రికి తరలించే అవకాశం ఉందని చెబుతున్నారు. భీమా కోరేగావ్ కేసులో కొన్ని నెలల నుంచి ముంబైలోని జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ప్రస్తుతం నవీ ముంబైలోని జేజే ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. కొద్దిరోజుల నుంచి ఆయనను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలని కుటుంబసభ్యులు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కుటుంబసభ్యులు, రచయితలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు వరవరరావు ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులోభాగంగా మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశారు. వృద్ధాప్యంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వరవరరావును కేంద్ర ప్రభుత్వం తప్పుడు కేసుల్లో ఇరికించారని, ఆయనను అమానుషంగా జైలులో నిర్బంధించారని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తాత్కాలిక బెయిల్ కోసం వరవరరావు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మే నెలలో వరవరరావు ఆరోగ్యం క్షీణించడంతో జేజే ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయనకు చికిత్స పూర్తికాకముందే మళ్లీ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆయనకు ప్రాణహాని ఉందని వెంటనే చికిత్స అందించాలని కుటుంబసభ్యులు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేశారు. ఇప్పుడు వరవరరావుకు కరోనా సోకడంతో ఆందోళన చెందుతున్నారు.

ఉస్మానియా హాస్పిటల్‌లోకి నీళ్ళు రావటం అంటే..
కెసిఆర్ తలదించుకోవాలి

– మొదటిపేజీ కొనసాగింపు..

చిన్న వానకే హాస్పిటల్‌లోకి నీళ్ళు వచ్చాయంటే పాలకులు సిగ్గుతో తల దించు కోవాలన్నారు. ఇది తుగ్లక్ పాలన అనాలా ఇంకా ఏమన్నా అనాలా అన్నారు. ఆయన మూఢ నమ్మకాల కోసం సెక్రటేరియట్ కూలగుడుతున్నడని.. ఎక్కువ పాజిటివ్ కేసులు వస్తాయని తక్కువ టెస్టులు చేస్తున్నారన్నారు. మరణాల సంఖ్య కూడా తక్కువ చేసి చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పని తీరుతో ప్రభుత్వ ఆసుపత్రులపైన జనాలకు నమ్మకం పోయిందని.. ప్రైవేట్ హాస్పిటల్ పై ప్రభుత్వానికి నియంత్రణ లేదన్నారు. కరోనాను ఆరోగ్యశ్రీలో ఎందుకు చేర్చటం లేదో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. ఈటెల రాజేందర్ రబ్బర్ స్టాంప్ మంత్రి అని.. కరోనాతో చనిపోతే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్లల్లో ఏమి జరుగుతుందో అందరికీ తెలిసే విధంగా లైవ్ డాష్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, ఎన్ని కోట్లు ఖర్చు పెట్టి అయినా ఉస్మానియా హాస్పిటల్‌ను కాపాడుకోవాలన్నారు. కరోనా పేషంట్లకు చికిత్స చేస్తున్న డాక్టర్స్, నర్సులు, సిబ్బందికి అందరికీ 50 శాతం ఎక్కువ జీతం ఇవ్వాలన్నారు.

– ఈటెలను కలసిని భట్టి..

గత నాలుగు నెలల నుంచి తెలంగాణ రాష్ట్రం భయం గుప్పిట్లో బతుకుతుంటే.. ప్రజలను గాలికి వదిలేసి సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కి వెళ్లిపోయారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు.ఉన్న అప్పులు సరిపోవడం లేదని, మళ్లీ కొత్త అప్పుల కోసం ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం తీసుకున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ ఉస్మానియాలో దుస్థితిపై ఆయన మంత్రి ఈటెలను కలిసి మాట్లాడారు. పరిస్తితిని వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈ నాలుగైదు నెలల్లో మరో రూ. 30వేల కోట్లు అప్పులు చేశారు!. ఇప్పుడున్న రూ.3 లక్షల కోట్ల అప్పులను ఐదారు లక్షల కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజలకు అవసరమైన వైద్య, విద్యను పక్కకు పెట్టి.. సచివాలయం కూల్చివేత, నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తున్నారు. మంత్రి కేటీఆర్‌కు ఇంగ్లీషు మాటలు తప్ప పరిపాలన మాత్రం రాదని విమర్శించారు. ఇప్పటి వరకు తెచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హరితహారంలో భాగంగా..

మొక్కలు నాటిన ఎమ్మోర్వో..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (శుభ తెలంగాణ) : బూర్గంపాడు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ పిలుపుమేరకు గురువారం తాసిల్దార్ కార్యాలయం వెనుక భాగంలో తాసిల్దార్ కిషోర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని హరితహారం కార్యక్రమంలో భాగంగా సుమారు 50 మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొక్కలు నాట్టడమే కాకుండా మొక్కలు బ్రతికే విధంగా చర్యలు చేపట్టాలని, రోజువాటికీ నీరు పట్టాలని కార్యలయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు వీఆర్వోలు, వీఆర్ఏలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కరోనా పోర్టబుల్ హాస్పిటల్

చెన్నై,జూలై16 :కరోనా వైరస్ సోకిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు కొత్త మెడికాబ్‌ను మద్రాస్ ఐఐటీ తయారుచేసింది.ఈ దవాఖానను కేవలం 4 గంటల్లో ఎక్కడైనా తయారు చేసుకునే వీలుంది. పోర్టబుల్ హాస్పిటల్ మెడికాబ్.. కరోనాకు వ్యతిరేకం గా పోరాటంలో గేమ్ ఛేంజర్ అని భావించవచ్చు. కరోనా రోగులను స్థానికంగా గుర్తించడం, పరీక్షించడం, వేరుచేయడం, చికిత్స చేయడంలో మెడికాబ్ సహాయపడుతుంది. ఈ పోర్టబుల్ దవాఖానను ఇటీవల కేరళలోని వయనాడ్‌లో ప్రారంభించారు. కరోనా రోగుల చికిత్స కోసం ఇటువంటి సూక్ష్మ ఆసుపత్రుల అభివృద్ధి ఎంతో కీలకం కానున్నాయి. వీటిని దేశవ్యాప్తంగా నగరం, గ్రామంలో ఎక్కడైనా సులభంగా నిర్వహించుకునే వీలున్నది. మెడికాబ్‌లో డాక్టర్ రూమ్, ఐసోలేషన్ రూమ్, మెడికల్ రూమ్, వార్డ్, రెండు పడకలతో కూడినఐసీయూ ఉన్నాయి.ఈ పోర్టబుల్ దవాఖానను రవాణా చేయడం చాలా సులువైనందున తక్కువ ఖర్చు అవుతుంది. కేరళలోని షెల్టర్‌లోని హబిటాట్ ఫర్ హ్యూమానిటీస్ టెర్విల్లిగర్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ మంజూరుతో ఈవిస్తరణ జరిగిందని ఐఐటీ–ఎం గురువారం తెలిపింది. స్టార్టప్ శ్రీచిత్ర ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీతో కలిసి పనిచేసింది. కేరళలో ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు సాంకేతిక పరిజ్ఞానం ప్రయోజనాలను, ప్రస్తుత సమయంలో మైక్రో హాస్పిటల్ యొక్క అవసరాన్ని వివరించగలవని స్మార్ట్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎసెన్షియల్ మాడ్యులస్ హౌసింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ రవిచంద్రన్ చెప్పారు. సమయంలో స్క్రీనింగ్, చికిత్స కోసం స్మార్ట్ హెల్త్‌మౌలిక సదుపాయాల అవసరం చాలా ఉన్నదని ఆయన తెలిపారు.

కార్పొరేట్ హస్పిటళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

మేడ్చల్ జిల్లా (శుభ తెలంగాణ) : ఘట్కేసర్ మండల సీపీఎం కార్యదర్శి నార్కట్ పల్లి సబిత కరోనా కష్టాల్లో పేదలు నానా ఇబ్బందులు పడుతుంటే కార్పొరేట్ హాస్పిటళ్లు వారి మూలుగులను పీల్చుకుతింటున్నాయని తక్షణమే ప్రైవేట్ కార్పొరేట్ హస్పిటళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సీపీఎం మండల కార్యదర్శి నార్కట్ పల్లి సబిత డిమాండ్ చేశారు. గురువారం ఘట్‌కేసర్ మండల కేంద్రములో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఎం కార్యకర్తలు నిరసన తెలిపారు.



– సీపీఎం నిరసన

అనంతరం సీపీఎం మండల కార్యదర్శి నార్కట్‌పల్లి సబిత మాట్లాడుతూ కరోనా వైరస్ రోజుకు రోజుకు తీవ్రంగా విజృంభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను గాలికి ఒదిలివేసిందన్నారు. కరోనా ను ఆరోగ్య శ్రీ లో చేర్చాలని డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదాలు కన్పిస్తుంటే కె.సి.ఆర్ వెయ్యి కోట్ల రూపాయలతో సచివాలయం కట్టలనుకోవడం ప్రజాధనం దుర్వినియోగం చెయ్యడమేనని అన్నారు. తక్షణమే సచివాలయ నిర్మాణం ఆపి కరోనా టెస్టులు పెంచి పేదల ఆరోగ్యాల బాధ్యతను చిత్తశుద్ధితో స్వీకరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమములో ఎన్‌పిఆర్‌డి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, పోచయ్య, దాసు, బిక్షపతి, రఘు, ఏ ఎమ్ జాఫర్ హుస్సేన్ నరసింహ,ఇనైథ్ ఖాన్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతేనే బ్యాంకుకు రండి

– డబ్బు కోసం ఎటిఎం ఉపయోగించండి: ఎస్‌బిఐ

హైదరాబాద్,జూలై16(శుభ తెలంగాణ): కరోనా కేసులు విస్తృతంగా పెరుగుతున్నందున ఎస్‌బీఐ ఉద్యోగులను, ఖాతాదారులను వైరస్ నుంచి రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్ మిశ్రా వెల్లడించారు. వివిధ బ్రాంచిల్లో భౌతిక దూరాన్ని పాటించడం, అవసరమైన మేర శానిటైజర్లు ఉంచడం, మాస్క్‌లు అందించడం తదితర చర్యలను చేపట్టామన్నారు.అవసరమైతేనూ బ్యాంక్‌కు రావాలని, ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రద్దీగా ఉండే శాఖల వద్ద థర్మల్ స్కానర్లు, సిబ్బందికి పీపీఈకిట్లు కూడా అందుబాటులోఉంచామన్నారు. ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్య మార్గదర్శకాలను పూర్తి స్థాయిలో అనుసరిస్తున్నాం. ఈ ఆందోళనకర పరిస్థితుల్లో బ్యాంకు ఉద్యోగులకు,వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు వంద శాతం వైరస్ కట్టడికి చర్యలు తీసుకున్నాం అని వివరించారు.అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఎస్‌బీఐ కట్టుబడి ఉంది.కరోనా పాజిటివ్ కేసులతో పాటు, వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా చాలా మంది ఉద్యోగులకు విధుల నుంచి మినహాయింపునిచ్చాం. కొన్ని సందర్భాల్లో, శానిటైజేషన్ చేసేందుకు శాఖలను కొద్దిసేపు మూసేస్తున్నాం. ఇలాంటి సమయంలో సేవలు నిలిచిపోతున్నాయి. ఖాతాదారులు తప్పనిసరైతేనే బ్యాంకులకు రావాలన్నారు. ఖాతాదారులు ఆరోగ్యాన్ని, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని యోనో అప్లికేషన్‌ను, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని, ఇతర సురక్షిత డిజిటల్ లావాదేవీలను అభివృద్ధి చేశామని తెలిపారు. డబ్బు తీసుకోవడానికి ఏటీఎంలను ఉపయోగించుకోవాలన్నారు. స్మార్ట్‌ఫోన్లు లేని ఖాతాదారులు సైతం మిస్డ్ కాల్ సౌకర్యంతో బ్యాలెన్స్ తెలుసుకోవచ్చన్నారు.

మహిళ పనికి ఫిదా అయిన..

జాయ్ అలుకాస్ యజమాని

– అంధ వ్యక్తిని బస్సు ఎక్కించిన మహిళ
– ఇంటిని బహుమతిగా ఇచ్చి ఉదారత

తిరువనంతపురం, జూలై16 : సరిగ్గా పది రోజుల క్రితం సోషల్ మీడియాలో వచ్చిన ఓ వీడియోలో బస్సు వెనకాలే పరిగెత్తి ఆపి మరీ ఓ అంధ వ్యక్తిని బస్సు ఎక్కించిన మహిళ విషయం బాగా పాపులర్ అయ్యింది. ఆమె పేరు గత పది రోజులుగా సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది. నెటిజెన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తన ఉద్యోగి సేవా గుణాన్ని మెచ్చిన యజమాని.. ఆమెకు ఒక ఇంటిని బహుమతిగా ఇచ్చారు. కేరళ తిరుపత్తూర్ జిల్లా పరిధిలోని తిరువల్లకు చెందిన సుప్రియ అనే మహిళ.. స్థానికంగా అలుకాస్ గ్రూపులో ఉద్యోగి. సుప్రియ సేవలను కొనియాడుతూ దేశ విదేశాల నుంచి నెటిజెన్లు ప్రశంసిస్తుండగా.. తాను కూడా అభినందిం చాలని భావించి ఆమె ఇంటికి వెళ్లారు ఆలుకాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ ఆలుకాస్. చిన్న కిరాయి ఇంట్లో కుటుంబంతో గడుపుతున్న సుప్రియను కలిసి అభినందించన చైర్మన్.. వచ్చే వారం త్రిస్సూర్ కు రావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. జాయ్ ఆలుక్కాస్ సూచన మేరకు త్రిస్సూర్ వెళ్లిన సుప్రియకు.. జాయ్‌ఆలుకాస్ ఆశ్చర్యపోయేలా ఇల్లును బహుమతి గా ఇచ్చారు. జాయ్ ఆలుకాస్ సతీమణి జోల్లి ఆలుకాస్ ఆమెను ఘనంగా సత్కరించారు. పరిగెత్తుతూ వెళ్లి అంధుడిని బస్ ఎక్కించే వీడియోను తిరుపత్తూరు జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి విజయ్ కుమార్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఆమె ఈ ప్రపంచాన్ని జీవించడానికి మంచి ప్రదేశంగా మార్చారు. ఆమె చూపిన దయ ఎంతో అందమైనది.. అని కాప్షన్ జోడించారు. ఈ వీడియోకు నెటిజెన్లు ఫిదా అయ్యారు. ఆమెలాగెనే మనమంతా మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రేమిద్దాం అని బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్ ట్వీట్ చేశారు.

పరిషత్‌లకు 15వ ఆర్థికసంఘం ద్వారా..

– మొదటిపేజీ కొనసాగింపు..

సంఘం నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలయ్యాక ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడం ఇదే మొదటిసారి. జిల్లాల్లోని మండలాలకు నిధులను కేటాయించే అవకాశం ఉంది. గత ప్రభుత్వాల హయాంలో ఆర్థిక సంఘం నిధులు క్రమం తప్పకుండా విడుదలయ్యేవి. కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా నిలిపివేసింది. దీంతో జడ్పీ, మండల పరిషత్‌లకు ఆరేళ్లుగా నిధులు నిలిచిపోయాయి. నిధుల కొరతతో జడ్పీటీసీ, ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. పలుమార్లు ప్రభుత్వాలు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎదురు చూపులు తప్పలేదు. ఎట్టకేలకు జిల్లా, మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా నిలిచిపోయిన నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. సుదీర్ఘకాలం అనంతరం మంజూరైన 15వ ఆర్థికసంఘం నిధులను పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాకు కేటాయించిన నిధులను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తారు. రెండు మూడు రోజుల్లో నిధుల కేటాయింపు పూర్తికానుందని పేర్కొంటున్నారు. అత్యవసర ఖర్చుల నిమిత్తమే ఈ నిధులను వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో కేటాయించిన విధంగా కాకుండా తక్కువైనా ఆర్థిక సంఘం నిధులతో జిల్లా, మండల పరిషత్ పాలన గాడిలో పడే అవకాశం కనిపిస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధుల మంజూరు ప్రారంభం కావడంతో జడ్పీటీసీ, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఆదాయం సమకూర్చే పనులను చేపట్టే వీలుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా గెలుపొందామనే సంతోషమే తప్ప నిధులు లేక పోవడంతో నిరాశనే మిగిలింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొన్ని హామీలైనా నెరవేరే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే సభ్యులు నీళ్లు మింగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొందరైతే నిధులు లేవన్న కారణంగా క్షేత్ర స్థాయి గ్రామ పర్యటనలకు దూరంగానే ఉంటున్నారు. అలాగే సమావేశాల సమయంలోనే తప్ప కార్యాలయాలకు ఎవరూ రాకపోవడంతో కళ తప్పి పోతున్నాయి. నిధులు లేవన్న కారణంగా సభ్యులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పై అంతగా ఆసక్తి చూపడం లేదు. అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల పరిస్థితి ఒకే విధంగా మారింది. అయితే ఇటీవల విడుదలైన నిధులతో కొంత ఊరట కలుగడంతో సభ్యులు కొత్త ఉత్సాహంతో కనిపిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన ఉత్తర్వులు అందాయని పంచాయితీ అధికారులు కూడా తెలిపారు. దీంతో జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించేందుకు ఏర్పాట్లను చేస్తున్నట్లు వెల్లడించారు. మరో రెండు మూడు రోజుల్లో జిల్లాల్లోని మండల పరిషత్‌లకు నిధుల కేటాయింపు పక్రియను పూర్తి చేస్తామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలురద్దు చేసి..

విద్యార్థులను ప్రమెట్ చేయండి

– సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ డిమాండ్

సిద్దిపేట జిల్లా(శుభ తెలంగాణ) : కోవిడ్19 కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలను వెంటనే రద్దు చేసి విద్యార్థులను ప్రమెట్ చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ఎంపిపి గడిపె మల్లేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువు మధ్యలో ఆపేసి మరల చదవాలని ఓపెన్ స్టడీలో అడ్మిషన్ తీసుకోని పదో తరగతి, ఇంటర్ మిడియట్ కోసం తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలో 70 వేల మంది విద్యార్థులు పరిక్షలు రాసెందుకు సిద్దం అయినప్పటికీ రాష్ట్రంలో కరోనా విజృంభిస్తున్న సమయంలో విద్యార్థుల భవిష్యత్తు,ఆరోగ్య దృష్ట్యా ఓపెన్ టెన్త్ ఇంటర్ మిడియట్ పరీక్షలను వెంటనే రద్దు చేసి విద్యార్థులందరినీ ప్రమెట్ చేసె దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి, సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని గడిపె మల్లేశ్ కోరారు.

మీరు అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకున్నారా

– మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్..

హైదరాబాద్ (శుభ తెలంగాణ) : ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంటే ఉస్మానియా ఆసుపత్రి విషయంలో ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని పశుసంవర్ధక,మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం ఆయన ఉస్మానియా హాస్పిటల్‌లో ఇంచారి సూపరింటెండెంట్ పాండు నాయక్, జోనల్ కమిషనర్ ప్రావిణ్య, టిఎస్ఎమ్ఐడిసి ఇ.ఇ చలం, హెచ్ఆర్‌డి ఎస్.ఇ రాయమల్లు, వాటర్ వర్క్స్ ఎస్.ఇ ఆనందరావు, జిఎం వినోద్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ డి.ఎఫ్.ఒ సందేశ్ తదితర అధికారులు, కార్పొరేటర్లు శంకర్ యాదవ్, పరమేశ్వరి సింగ్, మమతాగుప్తా లతో కలిసి పర్యటించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ 112 సంవత్సరాల క్రితం నిర్మించిన ఉస్మానియా హాస్పిటల్ లో ప్రతినిత్యం వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నాటి వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఉస్మానియా హాస్పిటల్ భవనం పటుత్వంపై ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ కూడా ప్రస్తుత భవనంలో హాస్పిటల్ ను కొనసాగించడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని, 11 బ్లాక్ లలో 8 బ్లాక్ ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో స్పష్టం చేసిందని వివరించారు. నియమించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఉస్మానియా హాస్పిటల్ ను సందర్శించి శిధిలావస్థలో ఉన్న ప్రస్తుత భవనాన్ని తొలగించి ఇదే స్థానంలో 24 అంతస్తులు చొప్పున 2 టవర్లతో అత్యాధునిక హంగులతో నూతన భవనాల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి ప్రకటిస్తే నాడు అడ్డుపడిన నాయకులు నేడు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిధిలావస్థలో ఉన్న ఆసుపత్రిని చంచల్ గూడ ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా, ఎంసీఐ నిబంధనల తో మెడికల్ సీట్ల లో కోత పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం తన ఆలోచన ను విరమించుకుందని చెప్పారు. చరిత్రలో మొదటిసారి ఉస్మానియా హాస్పిటల్ లోకి నీరు వచ్చిందని, దీనికి అనేక సాంకేతిక కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎగువన ఉన్న పుల్కావాడ, మచ్చి మార్కెట్, బేగం బజార్ తదితర ప్రాంతాల నుండి నీరు రావడం, ఓవర్ ఫ్లో వలన మాత్రమే ఆసుపత్రి లోకి నీరు వచ్చినాయని వివరించారు. జిహెచ్ఎంసి, డిజాస్టర్ మేనేజ్ మెంట్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకున్నారని వారిని అభినందించారు. వార్డ్ లోకి నీరు వచ్చిన వెంటనే స్పందించిన హాస్పిటల్ అధికారులు వార్డు లోని రోగులను పై అంతస్తులోకి తరలించారని పేర్కొన్నారు. భవిష్యత్ లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అన్ని రంగాల పై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలిపారు. ఎంతో ప్రమాదకర పరిస్థితిలో ఉన్న భవనం కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని చారిత్రక కట్టడం అనే వంకతో హాస్పిటల్ భవనం కూల్చివేతను అడ్డుకున్న ప్రతిపక్షాల నాయకులను ప్రశ్నించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ఇంతటి దౌర్భాగ్యపు ప్రతిపక్షాలను తాను దేశంలో ఎక్కడా చూడలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డుపడటం విపక్షాలకు అలవాటుగా మారిందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు ముఖ్యమంత్రి నిర్మిస్తామని అంటే అడ్డుకొని, నేడు డ్రామాలు ఆడుతున్నారని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నూతన సచివాలయం నిర్మాణాన్ని చేపడితే దానిని కూడా అడ్డుకునేందుకు అనేక కుయుక్తులు పన్నారని అన్నారు. ఉస్మానియా హాస్పిటల్ విషయంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోక ముందే కోర్టు సుమోటో గా స్వీకరించాలని కోరారు. 60 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ప్రభుత్వంపై కనీస అవగాహన లేకుండా నాయకులూ మాట్లాడుతున్నారని అన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల బాగోగులను పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్న కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తయిందని, 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతుందని, కోటి ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా మీ విధానాలు మార్చుకోకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు.



ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

ముంబై, జూలై16 :

దేశ ఆర్థిక రాజధాని ముంబైని వాన ముంచెత్తింది. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 వరకు భారీగా వాన కురిసింది. దీంతో మహానగరంలో రోడ్లన్ని జలమయమయ్యాయి. పన్నెండు గంటలపాటు వాన కురియండంతో 191.2 మి.మీా. నమోదయ్యిందని శాంతాక్రజ్ వెదర్ అబ్జర్వేటరీ ప్రకటించింది. దీంతో జూలై నెలలో 2015 తర్వాత అత్యంత భారీ వాన కురియడం ఇది రెండోసారని తెలిపింది. 2019, జూలై 3న అత్యధికంగా 215.6 మి.మీా.వాన కురిసిందని వెల్లడించింది. 2014, జూలై 3న 207.2 మి.మీా. వర్షం కురిసిందని, 2013లో కురిన 215.6 మి.మీా. వాన ఇప్పటివరకు అత్యధికమని పేర్కొంది. మొత్తంగా ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 16 వరకు 1,418 మి.మీా. వాన కురిసిందని, సాధారణంగా 2260.4 మి.మీా.వాన నమోదవ్వాల్సి ఉందని తెలిపింది. ఈ సీజన్‌లో 63 శాతం మాత్రమే వాన కురిసిందని వెల్లడించింది.

అదుపుతప్పి గుంటలో పడ్డ కారు

చెన్నై, జూలై16 : తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. విలుప్పురం జిల్లా దిండివనం సమీపంలోని పత్తిరి గ్రామం వద్ద ఓ కారు అదుపుతప్పి గుంటలో పడటంతో ఆరుగురు మరణించారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నది. తిరునల్వేలి జిల్లా నుంచి చెన్నై వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి పక్కనే ఉన్న గుంటలో పడిపోయింది. దీంతో డ్రైవర్ సహా, అందులో ప్రయాణి స్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారని విల్లుపురం ఎస్పీ ఎస్ రాధాకృష్ణన్ వెల్లడించారు. కారులో మరో ఇద్దరు చిన్నారులు ఉన్నారని, వారు తీవ్రంగా గాయపడ్డారని, వారిని దవాఖానకు తరలించామని చెప్పారు. డ్రైవర్ నిద్రపోవడంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ప్రమాదంపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుగు తున్నదని తెలిపారు.

కరోనాతో 99మంది వైద్యులు మృతి

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై16 :

తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి కంటికి కన్పించని కరోనా వైరస్‌తో వైద్యులు పోరాడుతున్నారు. దేశవ్యాప్తంగా కరోనా విధుల్లో వైరస్ సోకి ప్రాణాలు కోల్పోతున్న డాక్టర్ల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతున్నది. ఇప్పటి వరకు దేశంలో 1,302 మంది వైద్యులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, 99 మంది ప్రాణాలు కోల్పోయారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెలిపింది. ఈ నేపథ్యంలో వైద్య నిపుణులను ఐఎంఏ అలర్ట్ చేసింది. కరోనా సోకినవారిలో 586 మంది ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు కాగా, 566 మంది రెసిడెంట్ డాక్టర్లు, 150 మంది హౌస్ సర్జన్లు ఉన్నారని ఐఎంఏ ఏర్పాటు చేసిన నేషనల్ కోవిడ్ రిజిస్టీ తెలిపింది. చనిపోయిన వైద్యులలో 73 మంది 50ఏండ్లు పైబడిన వారు కాగా, 19 మంది 35-50 ఏళ్ల మధ్య వయస్సుగలవారని పేర్కొంది. ఏడుగురు మాత్రం 35ఏళ్లలోపువారని వెల్లడించింది.

కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలి..

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (శుభ తెలంగాణ) : కరోనా (కోవిడ్ 19)ను ఆరోగ్యశ్రీలో చేర్చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రాథమిక వైద్య శాల యందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం క్వారన్‌టైన్‌లో ఉండి పాలన సాగిస్తోందని అన్నారు. రాష్ట్రంలో రోజురోజుకీ కరోనా కోవిడ్ 19 విజృభిస్తూ ఈ మహమ్మారి వల్ల వందల మంది ప్రాణాలు కోల్పో తున్నారని అయిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి నట్టు వ్యవహరిస్తు దని దుయ్యబట్టారు. కరోనా వైరస్ రోజురోజుకి కేసులు పెరిగి పోతుండడంతో డాక్టర్లు, పోలీసు లు, ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. కరోనా వైద్య పరీక్షలు ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా చేయాలన్నారు. వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఆరోగ్య పరంగా ఉన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని పినపాక పి హెచ్ సి మొబైల్ డాక్టర్ సురేష్, వైద్యాధికారి సంజీవరావు లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు రమేష్, శ్యామల పూస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోడె ప్రతిమ ఆవిష్కరించిన తలసాని

హైదరాబాద్, జూలై 16(శుభ తెలంగాణ):



బాగా ప్రసిద్ధి చెందిన పశుజాతికి చెందిన తూర్పు పోడా కోడె ప్రతిమను గురువారం పశుసంవర్ధక శాఖ ఆవరణలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈపశు జాతి, నల్లమల్ల అడవి ప్రాంతంలోనిమన్ననూర్,అమ్రాబాద్ మండలం, నాగర్ కర్నూల్ జిల్లలో ఎక్కువగా ఉంటాయన్నాఉ. . దీనిని ఎన్‌బిఎజిఆర్ ఇండియా, తెలంగాణ స్థానిక జాతిగా గుర్తించింది.ఈ పశువులకుప్రధానంగా తెలుపు చర్మంపై గోధుమ, ఎరుపు మచ్చలు లేదా లేత గోధుమ రంగు చర్మంపై తెల్లని మచ్చలు,సూటి ,పదునైన కొమ్ములను కలిగి ఉంటాయి.అన్ని కాలాలలోఈ పశువులు వ్యవసాయ పనులుచాలా సమర్థవంతగా చేస్తాయి. వీటి ఉత్పాదక శక్తి చాలా ఎక్కువ. ఆవులు క్రమం తప్పకుండా దాని జీవిత కాలంలో 10 కంటే ఎక్కువ దూడలను ఇస్తాయి. ఈ పశువులుమేత తక్కువగా తిని,రోజుకు 20 లీటర్ల కన్నా తక్కువ నీరు తాగుతుంది. ఈ పశువులు సుదూర అటవీ ప్రాంతంలోని నీటిని గుర్తించి తాగి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం పశువైద్య సేవలలో రైతులకు ఇబ్బంది రాకుండా పశువైద్య ,పశుసంవర్ధక శాఖలో 530 వివిధ స్థాయిలలో పనిచేస్తుచున్నఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మరో ఏడాది 31,మార్చి, 2021 వరకు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లుమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలియజేసినారు. అదేవిధంగాఈ ఆషాడమాస బోనాల సందర్భంగా రాష్ట్రంలో కృతిమ గర్భధారణలో విశేష సేవలు అందిస్తున్న (1300) మందిగోపాలమిత్రులకు ఒక్క నెల వెతనభత్యం విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమములోసంచాలకులు డా. వి. లక్ష్మారెడ్డి,అదనపు సంచాలకులు డా. ఎస్. రాంచందర్ ,ఓ.ఎస్.డి. శ్రీ కళ్యాణ్ కుమార్, డైరేక్టరేట్ సిబ్బంది,పాల్గొన్నారు.

హరితహారంలో మొక్కలు నాటిన కార్పొరేటర్

మేడ్చల్ జిల్లా(శుభ తెలంగాణ) :

గురువారం కాప్రా సర్కిల్ ఏఎస్ రావ్ నగర్ డివిజన్ 2 పరిధి లోని సుబ్రహ్మణ్య నగర్ కాలనీలోని గాంధీనగర్ (కాప్రా డివిజన్1)కి చెందిన స్మశాన వాటికలో హరితహారంలో భాగంగా సుమారు 300 మొక్కలు ఏఎస్‌రావ్ నగర్ డైనమిక్ కార్పొరేటర్ శ్రీమతి పావని మణిపాల్ రెడ్డి ఆధ్వ ర్యంలో నాటడం జరిగిందిఅని . ప్రభుత్వం చేపట్టిన హరితహారం లో భాగంగా తమ డివిజన్‌ను గ్రీన్ డివిజన్‌గా అభివృద్ధి చేయుటకు కృషిచేస్తున్నామన్నారు.
స్మశాన వాటిక అభివృద్ధి కొరకు పెండింగ్ లో ఉన్న పనులను సెక్యూరిటీ గేట్ తో సహా ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఏఇ శ్రీ సంతోష్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మణిపారెడ్డి, భేతాళ బాలరాజ్, జిహెచ్ఎంసి అధికారులు ఏ.ఇ సంతోష్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి రామ్ రెడ్డి ,జవాన్ లు జి సత్తయ్య, దశరథ,



ఎస్ఎఫ్ఏ మంజుల, సుబ్రహ్మణ్య నగర్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్, గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు (సీనియర్ నాయకులు) ఎన్.మహేష్, ఉపాధ్యక్షులు (ఏరియా కమిటీ మెంబర్) భిక్షపతి, ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, ఎన్.కుమార్, జి.నర్సింగరావు, ఎన్. శ్రీనివాస్ మరియు యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జి. నర్సింగ్ రావ్, ఎం కనకరాజు, బి రాకేష్, కే. వెంకట్, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులను..

పర్మినెంట్ చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి...



సంగారెడ్డి జిల్లా (శుభ తెలంగాణ) : అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కార్మికులు రెండు రోజుల నిరాహార దీక్ష చేస్తున్నారు. మున్సి పల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,11వ పి.ఆర్.సి ప్రకారం 24 వేలు జీతం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉ పాధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే కార్మికులకు పర్మినెంట్, జీతాలు పెంచవల సిందిగా డిమాండ్ చేశారు. కార్మికులు తమ ప్రాణాలను పణంగాపెట్టి విధులు నిర్వహిస్తు న్నారు అని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి జయరామ్,ఆనంద్, శ్రీనుమల్లేష్‌మహిళలు పాల్గొన్నారు.

క్లీన్ రైల్వేస్‌గా నిలుస్తాం: పీయూష్

న్యూఢిల్లీ,జూలై16 : 2030 నాటికి ప్రపంచంలోనే తొలి క్లీన్ రైల్వేస్‌గా నిలుస్తామని కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. రానున్న మూడున్నర ఏండ్లలో రైల్వేలో వంద శాతం విద్యుత్తీకరణ జరుగుతుందన్నారు. మరో పది ఏండ్లలో దేశంలోని ప్రతి పౌరుడికి భారతీయ రైల్వే గర్వంగా నిలు స్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద క్లీన్ రైల్వేస్‌గా ఉంటామని ఆయన చెప్పారు. అంతర్జాతీయ పునరుత్పాదక రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తోందని పియూష్ గోయల్ తెలిపారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్' నినాదంతో అంతర్జాతీయ సోలార్ గ్రిడ్‌కి భారత్ అనుసంధానమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పీఎం కుసుమ్ పథకం ద్వారా పునరుత్పాదక విద్యుత్ వినియోగానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పియూష్ గోయల్ వివరించారు.

గంగూలీ సోదరుడికి కరోనా

కోల్‌కతా,జూలై16 : బీసీసీఐ అధ్యక్షుడు, టీమిండియా మాజీ సారథి సౌరభ్ గంగూలీ కుటుంబంలో కరోనా వైరస్ కలకలం సృష్టించింది. గంగూలీ సోదరుడు, బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) కార్యదర్శి స్నేహాశీష్ గంగూలీకి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. స్నేహాశీష్‌కు కరోనా సోకడంతో దాదా కూడా హోం క్వారంటైన్‌లోకి వెళ్లారు. బెంగాల్ మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ అయిన స్నేహాశీష్ కోవిడ్-19 పాజిటివ్‌గా తేలడంతో బెల్లె వ్యూ హాస్పిటల్‌లో చేరారు. 'గత కొద్దిరోజుల నుంచి స్నేహాశీష్ జ్వరంతో బాధపడుతున్నాడు. కరోనా సోకినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. వెంటనే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని' క్యాబ్ అధికారి ఒకరు తెలిపారు. హెల్త్ ప్రొటోకాల్స్ ప్రకారం సౌరభ్ కూడా కొద్దిరోజులు హోం క్వారంటైన్‌లో ఉండాల్సి ఉంటుందని దాదా సన్నిహితుడొకరు చెప్పారు.

కరోనాకు మాజీ ఐఏఎస్ అధికారి మృతి

ముంబై, జూలై16 : మాజీ ఐఏఎస్ అధికారిణ, మహారాష్ట్ర మొదటి మహిళా ఎన్నికల కమిషనర్ నీలా సత్యనారాయణ్ కరోనాతో మరణిం చారు. 72 ఏండ్ల సత్యనారాయణ్ కొన్నిరోజులుగా కరోనా బాధపడు తున్నారు. ఆమె ముంబైలోని సెవన్ హిల్స్ దవాఖానలో చికిత్స పొందు తున్నారు. పరిస్థితి విషమించడంతో ఈ రోజు ఉదయం 8 గంటలకు మరణించారని హాస్పిటల్ అధికారులు ప్రకటించారు. 1972 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నీలా సత్యనారాయణ్ 2014,జూలై 5న రిటైర్ అయ్యారు. పదవీ విరమణకు ముందు మహారాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మొదటి మహిళా కమిషనర్‌గా 2009లో నియమితులయ్యారు. రచయిత కూడా అయిన ఆమె పదవీ విరమణ తర్వాత అనేక పుస్తకాలు రాశారు.పలు సినిమాలకు సాహిత్యం కూడా అందించారు. ఆమె రాసిన రౌన్‌అనే నవల ఆధారంగా మరాఠీలో సినిమా కూడా రూపొందింది. మొత్తం గా సత్యనారాయణ్ 23 పుస్తకాలు రాశారు.

కరోనా పాజిటివ్ కేసుల సంఖ్యపై గందరగోళం

అదిలాబాద్,
జూలై 16(శుభ తెలంగాణ):

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల పెరుగుద ల ఆందోళన కలిగిస్తోంది. గల్ఫ్‌తో పాటు, ముంబై, హైదరాబాద్ నుంచి వచ్చిన కార్మికులతో గ్రామా ల్లో సైతం కరోనా విస్తరిస్తోంది. ఈ విషయంలో లెక్కలు సరిగా లేవన్న ఆందోళన వ్యక్తం అవుతోం ది. జనం లాక్‌డౌన్‌కు ముందు అలాగే లాక్‌డౌన్‌లోనూ ఎంతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ ప్రస్తుతం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్లు ఆరోపణలున్నాయి. మాస్కులు ధరించకపోవడం, భౌతికదూరం పాటించకపోవడం లాంటి వాటితో పాటు విందులు, వినోదాల్లో పాల్గొ నడం, షాపింగ్‌లు, మార్కెటింగ్‌లు జోరు గా చేస్తుండడం, గుంపులు గుంపులుగా తిరుగుతుండడం లాంటి పరిణామాలన్నీ కరోనా వైరస్‌వ్యాప్తికి కారణమవుతున్నా యి. మొదట పోలీసులు కఠినంగా వ్యవహరించి వ్యాప్తిని కట్టడి చేయ గలిగారు. అయితే లాక్‌డౌన్ అనం తరం పరిస్థితి మారిపోవడంతో నిర్లక్ష్యధోరణి ప్రజల్లో పెరిగి పోయింది. దీనికి తోడు కరోనా సమాచారం, హోం క్వారంటైన్, ఐసోలేషన్ సమాచారం స్పష్టంగా తెలియకపోవడం కూడా నిర్లక్ష్యాని కి తోడవుతోందని అంటున్నారు. కరోనావైరస్ వ్యాప్తి తీవ్రంగా కొనసాగుతున్నట్లు అధికారులు ప్రచారం చేసినట్లయితే కొంతమేరకైనా జనం కట్టడికి లోబడి ఉండేవారంటున్నారు. ప్రస్తుతం కట్టడి నిర్వీర్యమైపోయిందని, జనం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రాష్ట్రస్థాయిలో విడుదలయ్యే హెల్త్ బులెటిన్‌లో జిల్లాకు సంబంధించిన వివరాలు ఒక రకంగా, జిల్లాస్థాయి హెల్త్‌బులెటిన్‌లో పాజిటివ్ కేసులకు సంబంధించిన వివరాలు మరోరకంగా ఉ ండడంతో అంతటా అయోమయం నెలకొంటోంది. వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయలోపంతోనే గత కొద్ది రోజుల నుంచి ఇలాకరోనాపై అస్పష్టమైన వివరాలు వెల్లడవుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. వైద్య,ఆరోగ్యశాఖ యంత్రాంగం కరోనా విషయంలో పక్కా సమాచారాన్ని ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వివరాలు సైతం పకడ్బందీగా జారీ చేయాలంటూ ఆదేశించినప్పటికీ వైద్యారోగ్యశాఖ పనితీరులో మాత్రం మార్పు కనిపించడం లేదంటున్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారితో పాటు ఐసోలేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారు, హోం క్వారంటైన్‌లో ఉన్న వారు, గాంధీ ఆసుపత్రికి, రిమ్స్ ఆసుపత్రులకు తరలించిన వారి విషయంలో కూడా అధికారులు అస్పష్టమైన సమాచారాన్ని ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. ఓ అధికారి చెప్పేదానికి మరో అధికారి చెప్పే దానికి పొంతన లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. కోవిడ్‌కు సంబంధించిన నోడల్ అధికారి తీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయిన అంశం చర్చనీయాంశం అయ్యింది. ఇలా గత మూడు నెలల నుంచి కరోనా విషయంలో సంబందిత యంత్రాంగం అనుసరిస్తున్న విధానం పట్ల అనేక ఆక్షేపణలు కొనసాగుతున్నాయి. కరోనా పాజిటివ్ కేసుల తీవ్రత పెరుగుతున్నప్పటికి అధికారులు వాస్తవాలను వెల్లడించడం లేదంటున్నారు. దీని కారణంగానే జనం మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భౌతిక దూరం నిబందనను, మాస్కులు ధరించడం లాంటి వాటిని ఉ ల్లంఘిస్తున్నారంటున్నారు. వాస్తవానికి ప్రతిరోజూ దీనికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ను విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఈ నిబందనను ఉ ల్లంఘించారంటున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి మాత్రమే ఈ హెల్త్ బులెటిన్‌ను విడుదల చేస్తున్నప్పటికీ ఇందులో కూడా వివరాలన్నీ తప్పుల తడకగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఏ రోజు వివరాలను అదే రోజు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఆలస్యంగా ఆ వివరాలను రాత్రివేళ జారీ చేస్తున్నారు. దీంతో మరుసటి రోజుకు సంబంధించిన కరోనా సమాచారమంతా గడబిడగా మారుతోంది. హోం క్వారంటైన్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంతో పాటు ఎంతమంది శాంపిళ్ళను సేకరించి ల్యాబ్‌కు పంపారోననే విషయంలో కూడా అధికారులు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కరోనా కేసులు
- మాస్కులు ధరించడం.. భౌతిక దూరం పాటించడంలో నిర్లక్ష్యం

Edited, printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana.
Corporate Office : RamaKrishna Publictions, MIG-6, Flat No.6,Baghlingampally, Hyderabad, Telangana. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com